సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం ; 23 ; ఆగస్టు ; 2024



కేజీహెచ్ మార్చురీ వద్ద బాధితుల ఆర్తనాదాలు



అంతులేని ఆక్రందన

వారిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి ఈ ఏడాదే పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఓ బిడ్డకు జన్మనివ్వబోతోన్న ఆ దంపతులు భవిష్యత్తును ఊహించుకుంటూ పొందిన ఆనందానికి అంతేలేదు. వారి ఆనందాన్ని చూసి మృత్యువుకూ కన్నుకుట్టింది. ఫార్మా ప్రమాదం రూపంలో భర్తను కాటేసింది. తమ బిడ్డ భూమిపైకి రాకముందే భర్త(చిరంజీవి)ను పోగొట్టుకున్న ఆ ఇల్లాలి (లీలాదేవి) వేదన వర్ణనాతీతం. కేజీహెచ్ మార్చురీ వద్ద భర్త నుంచి పొందిన ప్రేమను తలచుకుంటూ, అతను చేసిన బాసలు గుర్తు చేసుకుంటూ విలపిస్తుంటే.. యముడు మనసు మార్చుకునైనా ఆమె భర్త ప్రాణాల్ని తిరిగిస్తే బాగుండు కదా.. అని కోరుకోని వారు లేరంటే అతిశయోక్తి కాదు.





కన్నీటి సుడులు



ఫార్మా కంపెనీ వద్ద పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట : ఫార్మా ప్రమాదపు మృతుల బంధువుల రోదనలతో విశాఖ కేజీహెచ్, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి పరిసరాలు మిన్నంటాయి. ఎటు చూసినా తమ ఆత్మీయుల్ని కోల్పోయిన కుటుంబ సభ్యుల వేదనలే. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో మృత్యు ఒడికి చేరిన తమవారిని కడసారి చూసుకునేందుకు గంటల తరబడి నోచుకోక నరకయాతన అనుభవించారు. తమవారి మృతదేహాలు ఎక్కడున్నాయో.. ఎవరిని సంప్రదించాలో తెలీక.. శవాగారం వద్ద.. జాగారమే చేశారు.బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం రాత్రి 10 గంటల వరకూ మార్చురీల వద్ద పడిగాపులు కాశారు. వారికి కనీస ఏర్పాట్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం అణువణువునా కనిపించింది. భర్తను కోల్పోయిన గర్భిణీ ఏడుస్తూ, నీరసించిపోయినా కేజీహెచ్ సిబ్బంది కన్నెత్తి చూడలేదు.



మృతుల బంధువులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు

నేడు అనకాపల్లికి మాజీ సీఎం జగన్ రాక



విశాఖ సిటీ : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లికి రానున్నారు. ఉదయం 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి విమానంలో బయలుదేరి 10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 11.20కు అనకాపల్లిలో ఉన్న ఉషా ప్రైమ్ హాస్పిటల్‌కు వెళతారు. అక్కడ ఎసైన్షియా కంపెనీ ప్రమాద బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి మధ్యాహ్నం 12.30కు అక్కడి నుంచి బయలుదేరి 1.30కి విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి బెంగళూరు పయనమవుతారు.

నేడు మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాడేరు : స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రతి శుక్రవారం నిర్వహించే మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఇన్నాళ్లు నిర్వహించలేదని, ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జి.మాడుగుల ఎంపీపీగా కల్యాణి



ఎంపీపీ కల్యాణికి ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్

జి.మాడుగుల: ఎంపీపీగా వంతాల ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కిముడు కల్యాణి నియమితులయ్యారు. ఈ మేరకు జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ కె.లక్ష్మి రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో కల్యాణికి అవకాశం దక్కింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్.అప్పలరాజు, మాజీ సర్పంచ్ కొండబాబు పాల్గొన్నారు.

5న విద్యుత్ ఉద్యోగుల ధర్నా

- చింతపల్లిలో పోస్టర్ల ఆవిష్కరణ



ధర్నాకు సంబంధించి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చిన్నయ్యపడాల్

చింతపల్లి: వచ్చేనెల నిర్వహించ తలపెట్టిన విద్యుత్తు ఉద్యోగుల ధర్నాను జయప్రదం చేయాలని విద్యుత్తు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను గురువారం ఆయన చింతపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 26వేల మంది ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు ఉద్యోగులు సంఘ ప్రతినిధులు సత్యనారాయణ, శివప్రసాద్ రమణ తదతరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని పూజలు



గ్రామ పొలిమేరలో పసుపు నీళ్లను పోస్తున్న గిరిజన మహిళలు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేటలో గురువారం గ్రామం సుభిక్షంగా ఉండాలని, వరుణుడు కరుణించాలని కోరుతూ గిరిజన మహిళలు పూజలు చేశారు. కుండలతో పసుపు నీటిని గ్రామ పొలిమేరకు తీసుకువెళ్లి రోడ్డుపై పోశారు. అక్కడే గ్రామ దేవతలకు పసుపు కుంకుమ సమర్పించి పూజించారు. ఇలావుండగా గ్రామంలో మరిడమ్మతల్లి ఉత్సవాలు శనివారం నుంచి 29 వరకు వైభవంగా నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

తీరని వేదన.. ఏదీ సాంత్వన

- ఘటనా స్థలంలో హృదయ విదారక దృశ్యాలు
- ఇప్పటికీ అలాగే శరీర అవశేషాలు
- పూర్తి కాని శిథిలాల తొలగింపు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- ఆస్పత్రుల్లో క్షతగాత్రుల అరణ్యరోదన
- అనకాపల్లి, విశాఖ ఆస్పత్రుల్లో చికిత్స
- తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు

సాక్షి, అనకాపల్లి: ఘోర ప్రమాదానికి వేదికగా నిలిచిన అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణంలో.. హృదయ విదారక దృశ్యాలెన్నో గుండెను మెలిపెడుతున్నాయి. రియాక్టర్ పేలి 24 గంటలైనా ఘటనా స్థలంలో శరీర అవశేషాలు చెట్టు కొమ్మకు వేలాడుతూనే ఉన్నాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాల సభ్యులు రెండో రోజు గురువారం సాయంత్రం వరకు క్రేన్‌లతో భవన శిథిలాలు తొలగిస్తూనే ఉన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గల మెడికవర్, ఉషా ప్రైమ్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను.. వారి పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. ఇప్పటికీ ఫ్యాక్టరీ పరిసరాల్లో రసాయనాల వాసన పోలేదు. కంపెనీ చుట్టూ దట్టమైన పొగలతో నల్లని మబ్బులు కమ్మినట్లుగా ఉంది.

కంపెనీ ముందు పడిగాపులు

మృతుల బంధువులు గురువారం వేకువజాము నుంచే ఎసైన్షియా కంపెనీ వద్దకు చేరుకున్నారు. సీఎం చంద్రబాబు వచ్చేవరకూ వారు వేచి ఉన్నారు. వర్షంలో కూడా తడిసే అక్కడ ఆర్తనాదాలతో పడిగాపులు కాశారు. మృతి చెందినట్లు తమకు అధికారులు గానీ, కంపెనీ యాజమాన్యం గానీ సమాచారం ఇవ్వలేదని.. కనీసం స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కల్పించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తాను అండగా ఉంటానని చెప్పినా తమకు నమ్మకం లేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబును కలిసేందుకు ప్రయత్నించినా.. ఆయన వచ్చిన కంపెనీ వెనక మార్గం వైపు వీరిని అనుమతించలేదు. దీంతో కంపెనీ ముందే సాయంత్రం వరకూ పడిగాపులు కాశారు.



మృతుడి బంధువుల ఆర్తనాదాలు

ప్రమాద ఘటనపై సీఎం సమీక్ష

ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రొడక్షన్ బ్లాక్‌లో బుధవారం జరిగిన ప్రమాదాన్ని పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మధ్యాహ్నం 2.34 గంటలకు హెలికాప్టర్ ద్వారా అచ్యుతాపురం సెజ్‌కు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన బ్లాకులను సందర్శించారు. అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా పరిశ్రమల అధికారులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఘటన జరిగిన క్రమాన్ని మ్యాప్ ద్వారా ముఖ్యమంత్రికి కలెక్టర్, ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రతినిధులు వివరించారు. అనంతరం హోం మంత్రి అనిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక పాటిల్, విశాఖపట్నం సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశం అనంతరం సాయంత్రం 5.25 గంటలకు ఫార్మా కంపెనీ నుంచి హెలికాప్టర్‌లో ఎయిర్ పోర్టుకు బయలుదేరారు.

మహా ప్రస్థానం వాహనాల్లో తరలింపు

పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కేజీహెచ్ నుంచి మహా ప్రస్థానం వాహనాల్లో కాకినాడ, రాజమండ్రి, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లోని వారి స్వగ్రామాలకు తరలించినట్లు 108 జోనల్ మేనేజర్ గంగరాజు తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్ పర్యవేక్షించారు.

డ్యూటీకి వెళ్లిన పావుగంటలోనే..



పూడి మోహన్‌ను నేను పెంచుకుంటున్నాను. వాడి వయసు 20 ఏళ్లు. వాళ్ల అన్నయ్య నాని ఎసైన్షియా కంపెనీలోనే ఏడాదిగా పనిచేస్తున్నాడు. అతని రిఫరెన్స్‌తో రెండు నెలల కిందటే మోహన్ జాబ్‌లో చేరాడు. నిన్న మొదటి షిఫ్ట్‌లో అన్నయ్య నాని డ్యూటీ అయిపోగా.. తమ్ముడికి వెళ్లొస్తానని చెప్పి వచ్చేశాడు. రెండో షిఫ్ట్‌కు వెళ్లిన మోహన్ పావుగంటలోనే రియాక్టర్ పేలి చనిపోయాడు. అధికారులు కనీస సమాచారం ఇవ్వలేదు.

– దేవి, మృతుడు పూడి మోహన్ పిన్ని

పరిహారం ప్రకటించడం కాదు.. అందించాలి

- ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో ఇచ్చినట్లు అందరికీ అందించాలి
- ఘటనాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్సీ బొత్స, మాజీ మంత్రులు

సాక్షి, అనకాపల్లి: ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటించడమే కాదు, వెంటనే అందించాలని వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ప్రమాదం జరిగిన స్థలాన్ని మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి చేరుకుని, ఉషా ప్రైమ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తారని తెలిపారు. తమ నాయకుడి ఆదేశాల మేరకే క్షతగాత్రుల వద్దకు వెళ్లి, వారిని పరామర్శించి, మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పినట్లు పేర్కొన్నారు. ఫార్మా కంపెనీలో ఇంత పెద్ద ప్రమాదం జరిగితే స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి స్పందించిన తీరు దారుణమని బొత్స ఆక్షేపించారు. వారికి తీరిక వచ్చినప్పుడు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని విమర్శించారు.

భర్త లేడన్న నిజం ఉదయం వరకూ చెప్పలేదు..



పరిశ్రమ గేటు వద్ద యల్లబిల్లి లోవమ్మ

ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో యల్లబిల్లి చిన్నారావు(34) మరణించిన విషయం ఆయన భార్య లోవమ్మకు బంధువులు, చుట్టుపక్కల వారు గురువారం ఉదయం వరకూ చెప్పలేకపోయారు. లోవమ్మ తీవ్రమైన మూర్ఛరోగంతో బాధపడుతోంది. ఆమెకు నెలకు రూ.5 వేల వరకు మందులకు ఖర్చవుతోంది. చిన్నారావు, లోవమ్మ దంపతులకు ఏడేళ్లలోపు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం పరిశ్రమలో పెయింటర్‌గా పనిచేస్తున్న చిన్నారావు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. ఈ విషయం అతడి భార్యకు ఎలా చెప్పాలో తెలియక బంధువులు, ఇరుగుపొరుగు వారు చాలా ఇబ్బంది పడ్డారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు చెప్పి ఆమెను ఓదార్చారు. చివరకు గురువారం ఉదయం ఆమె కు విషయం చెప్పారు. పరిశ్రమ ముఖద్వారం వద్ద దీనంగా ఉన్న ఆమెను పలువురు మీడియా ప్రతినిధులు అడిగినా, తన భర్త ఏమయ్యాడో పూర్తిగా చెప్పలేని దయనీయ స్థితిలో ఉండటం పలువురి హృదయాలను ద్రవింపజేసింది.

కేజీహెచ్ మార్చురీ వద్ద హైడ్రామా



ఫార్మా మృతుల బంధువులతో కేజీహెచ్ మార్చురీ పరిసరాలు

మహారాణిపేట: ఫార్మా ఘటనకు సంబంధించి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణలో గురువారం మధ్యాహ్నం వరకు హైడ్రామా నెలకొంది. బుధవారం రాత్రి 12 మృతదేహాలను కేజీహెచ్‌కు తీసుకురావడం తెలిసిందే. గురువారం ఉదయం విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మార్చురీ వద్దకు వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందజేస్తామన్నారు. అయితే ప్రకటించిన నష్టపరిహారానికి అనకాపల్లి కలెక్టర్ లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని మృతుల బంధువులు ఆయనకు స్పష్టం చేశారు. ఎలాంటి నష్ట పరిహారం ప్రకటించకుండా, కంపెనీ వాళ్లు రాకుండా ఎలా పంచనామాకు సంతకాలు పెడతామని నిరాకరించారు. కంపెనీ ఉద్యోగి చనిపోతే ఎలాంటి సమాచారం లేదని, యాజమాన్యం ఇప్పటికీ రాలేదని, తాము ఎవరిని నమ్మాలని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలి ఎమ్మెల్యే, అనకాపల్లి ఎంపీ రాకపోవడంపై బాధితులు మండిపడ్డారు. రెవెన్యూ, పోలీసులు, కేజీహెచ్ సిబ్బంది మృతుల బంధువులకు ఎంతగానో నచ్చజెప్పేందుకు యత్నించినప్పటికీ.. ఫలితం లేకపోయింది. అంతా తాము చూసుకుంటామని బతిమలాడినా వారు ఒప్పుకోలేదు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెవెన్యూ, పోలీసులు అన్ని రకాలుగా ప్రయత్నించారు. ఇంతలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు మార్చురీ వద్దకు వచ్చి.. ఇంకా శవపంచనామా చేయకపోవడంపై ప్రశ్నించడంతో కదలిక వచ్చింది. అప్పటికి రెండు పంచనామాలు పూర్తి చేసి, మూడో పంచనామాకు శ్రీకారం చుట్టారు. ఛిన్నా భిన్నమైన మృతదేహాలకు సంబంధించిన బంధువులను రప్పించి.. రాత్రికి ప్రక్రియ పూర్తి చేశారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాల ఆందోళన

అనకాపల్లి : ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో చనిపోయిన ఐదుగురి మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఎన్టీఆర్ ఆస్పత్రి పోస్టుమార్టం రూమ్ వద్ద ప్రభుత్వానికి, ఫార్మా కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా బాధిత కుటుంబాల వారు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, సంఘటన జరిగి 24 గంటలు దాటినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికీ స్పష్టమైన ప్రకటన రాకపోవడం అన్యాయమని అన్నారు. కాలం చెల్లిన ఫార్మా కంపెనీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబానికి రూ.కోటి చెల్లించాలని, నష్టపరిహారం చెల్లింపుపై లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చురీ నుంచి ఎన్టీఆర్ ఆస్పత్రి బయటకు వెళుతున్న సమయంలో ఆస్పత్రి గేటు వద్ద పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ తమ సిబ్బందితో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మృతుల కుటుంబానికి కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చురీ వద్ద ప్రభుత్వ అధికారులు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ మృతుడి కుటుంబానికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇంత ఘోరం జరిగినప్పటికీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్ వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించకపోవడం దారుణమన్నారు. ఆందోళనలో సీపీఎం, సీఐటీయూ నాయకులు, ఆర్.శంకరరావు, రాజు, అప్పారావు, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబాలు, సీపీఎం, సిటు నాయకులు

సీబీఎస్‌ఈ విధానంలో పరీక్షలు

- ఎంపిక చేసిన పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా నిర్వహణ
- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు



పెదబయలు కేజీబీవీ పాఠశాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

పెదబయలు: ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో పదో విద్యార్థులు ఈ ఏడాది సీబీఎస్‌ఈ సిలబస్ మేరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాస్తున్నారని డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కేజీబీవీ, ఏపీ గురుకుల బాలుర పాఠశాలలో ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 35 పాఠశాలల్లో 2061 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. దీనివల్ల వారికి ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన పెరుగుతుందన్నారు. అంతేకాకుండా వరు ఆన్‌లైన్ పాఠ్యాంశాలపై ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తామన్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా గణితం పరీక్ష సజావుగా జరిగిందని ఆయన తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఆగ్రహం

పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల పరిధిలోని పీఈటీలు, పీడీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన డీఈవో బ్రహ్మాజీరావు ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. రెండు మండలాలకు చెందిన ఆరుగురు వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణకు హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఎందుకు హాజరు కాలేదని సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలను ప్రశ్నించారు. ప్రతిరోజు పాఠశాలల్లో విద్యార్థులతో వ్యాయామం చేయించాలని సూచించారు. ఎంఈవో కృష్ణమూర్తి, సమగ్ర శిక్ష సీఎంవో కె.బాస్కరరావు, ఐటీ సెల్ ఇన్‌చార్జీలు కె.కామరాజు, సతీష్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆయువు తీసిన అతివేగం

- తురాయిగుడ జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న బైక్‌ల ఢీ
- సంఘటన స్థలంలోనే ఇరువురి మృతి
- మృతుల్లో దేవసురేందర్‌నాయుడు నవ వరుడు



దేవసురేందర్‌నాయుడు, మన్నసా మృతదేహాలు



మృతులు (ఫైల్)

అరకులోయ రూరల్ : అతివేగం ఇద్దరు ప్రాణాలను బలిగొంది. మండలంలోని పెదలబుడుకు కూతవేటు దూరంలో తురాయిగుడ జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చొంపి గ్రామానికి చెందిన దేవసురేందర్‌నాయుడు (22), దలపతి సిద్ధూ (20), పెలమాల ధనుష్ (20) ఒకే ద్విచక్రవాహనంపై శుభకార్యం నిమిత్తం పెదలబుడులోని బంధువుల ఇంటికి బయలుదేరారు. పెదలబుడు గ్రామానికి చెందిన జన్ని మన్నసా (17) ద్విచక్ర వాహనంపై అరకులోయ వైపు బయలుదేరాడు. ఎదురెదురుగా వస్తున్న వీరి వాహనాలు తురయిగుడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సురేందర్ నాయుడు, జన్ని మన్నసా సంఘటన స్థలంలో మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సిద్ధూ, ధనుష్‌ను స్థానిక వైద్యవిధానపరిషత్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

పెళ్లయిన ఆరు నెలలకే..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. చొంపి గ్రామానికి చెందిన పద్మనాయక్ భీమన్న, మితుల దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో మృతుడు దేవసురేందర్‌నాయుడు పెద్ద కుమారుడు. ఐటీఐ చదివాడు. అదే గ్రామానికి చెందిన తేజ అనే యువతిని ప్రేమించాడు. వీరిద్దరు ఆరునెలల క్రితం వివాహం చేసుకున్నారు.రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు అతనిని కబళించడంతో ఆ కుటుంబం గుండెలవిసేలా రోదిస్తోంది. భర్త మృతదేహం వద్ద నవ వధువు తేజ విలపించడం అందరినీ కలచివేసింది.

శుభకార్యానికి వచ్చి..

పెదలబుడుకు చెందిన జన్ని మోహన్‌రావు, తల్లి నీలమ్మ దంపతులకు మృతుడు జన్ని మన్నసా ఒక్కడే కుమారుడు. తల్లిదండ్రులు విశాఖలో కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి వద్దనే ఉంటూ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం స్వగ్రామం పెదలబుడు వచ్చాడు. అరకులోయ వెళ్తుండగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. వీరి మృతితో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



రోదిస్తున్న దేవసురేందర్‌నాయుడు భార్య తేజ, బంధువులు

క్లుప్తంగా

అల్లూరి జేసీ ఘెరావ్


బాధితులతో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా జేసీ అభిషేక్ గౌడ్

అనకాపల్లి: సీఎం పర్యటన నేపథ్యంలో ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీ వద్దకు స్పెషల డ్యూటీపై వచ్చిన అల్లూరి జిల్లా జేసీ అభిషేక్‌గౌడ్‌ను మృతుల కుటుంబ సభ్యులు గురువారం మధ్యాహ్నం అడ్డుకున్నారు. ప్రమాదం జరిగి 24 గంటలు అవుతున్నప్పటికీ మృతుల కుటుంబ సభ్యులకు అటు ప్రభుత్వంగానీ, ఇటు జిల్లా అధికార యంత్రాంగం గానీ సమాచారం ఇవ్వకపోవడం అన్యాయమని, పత్రికలు, టీవీల్లో చూసి వచ్చామని వారు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని, పోస్టుమార్టం అయిన మృతదేహాలను తీసుకుని వెళ్లాలని జేసీ నచ్చచెప్పే ప్రయత్నం చేయడంతో బాధితులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే రూ.కోటి చెల్లించాలని, ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా తెలపాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో ఉన్న ఐదుగురిలో నలుగురు కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నామని, మృతుడు ఎం.సురేంద్ర కుటుంబం అకౌంట్ సరిగా లేదని జేసీ చెప్పారు.

విద్యార్థులకు నేడు బేస్‌లైన్ పరీక్ష

- ఐటీడీఏ పీవో అభిషేక్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకునేందుకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో పక్కాగా బేస్‌లైన్ పరీక్షలను నిర్వహించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో పలు గిరిజన సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈనెల 23న బేస్‌లైన్ పరీక్షను నిర్వహించాలని సూచించారు. ఈ పరీక్షలో తెలుగు, అంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను కచ్చితంగా నమోదు చేసేందుకు ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. గుర్తించిన సామర్థ్యాలను ఆధారంగా తదుపరి బోధన చేసేలా కార్యాచరణ ఉంటుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

11 నుంచి నూతన ఇసుక విధానం

కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ అమిత్ బర్దర్

పాడేరు : వచ్చేనెల 11 నుంచి నూతన ఇసుక విధానం అమలుచేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఎస్పీ అమిత్‌బర్దర్‌తో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లోడింగ్, రవాణ చార్జీలు మాత్రమే చెల్లించి ఇసుకను పొందవచ్చని ఆయన తెలిపారు. జిల్లాలో ఎటపాక మండలం గుండాల వద్ద రెండు ఇసుక రిచ్‌లు ఉన్నాయని వాటిలో ప్రస్తుతం 1,65,557 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఆయా చోట్ల ఇసుక టన్నుకు రూ.300 మాత్రమే లోడింగ్ చార్జీలు చెల్లించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మించి ఎవరైనా అక్రమంగా నగదు అడిగితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక బుకింగ్ కోసం గుండాల గ్రామ సచివాలయంలో సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. డిజిటల్ చెల్లింపులు మాత్రమే స్వీకరిస్తారని చెప్పారు. ఇసుక సరఫరా చేసే వాహనాలు ముందుగా జిల్లా రవాణ శాఖ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకొని యూనిక్ ఐడీ పొంది ఉండాలన్నారు. వాటికి మాత్రమే ఇసుక రవాణ చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఇసుక సరఫరాలో ఎక్కడైన అవినీతి, అక్రమాలకు పాల్పడితే రాష్ట్ర స్థాయిలో 18005994599, జిల్లా స్థాయిలో 18004256061 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. వీటికి సంబంధించి ఫిర్యాదుల పరిశీలనకు జాయింట్ కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించినట్టు తెలిపారు. స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని గెడ్డల వద్ద ఇసుకను తరలించుకునేందుకు గతంలోనే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇదే అదనుగా భావించి ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా.. అధిక రవానా చార్జీలు వసూలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇసుక యార్డ్‌ల వద్ద పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. చలానా లేకుండా వాహనాలు ఇసుక రీచ్‌ల్లోకి వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. ఇసుక సరఫరాలో ఎక్కడైన అక్రమాలు జరిగితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉచిత ఇసుక విధానంపై, లోడింగ్, రవాణ చార్జీలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

కోలుకున్న గిరిజన విద్యార్థులు

కోటవురట్ల మండలం కై లాసపట్నంలో కలుషిత ఆహారం ఘటనలో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థులు కోలుకుంటున్నారని కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. ముగ్గురు మృతుల్లో ఒకొక్కరికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న ఒక్కో విద్యార్థికి రూ.50వేల పరిహారం ఇస్తామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల వసతి గృహ నిర్వాహకులతో ప్రత్యేకంగా టెలిగ్రామ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, ప్రతి వసతి గృహంలో విద్యార్థులకు అందించే ఆహారం ఫొటోలను అందులో పంపించాలన్నారు. ఆశ్రమ వసతి గృహాల్లో మెనూను నిత్యం పర్యవేక్షిస్తామని చెప్పారు. కచ్చితంగా మెనూ అమలు చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

'డ్రాగన్‌ఫ్రూట్'తో ఆర్థికాభివృద్ధి


డ్రాగన్ ఫ్రూట్ సాగును పరిశీలిస్తున్న ఉపాధి హామీ రాష్ట్ర విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున్

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని, అందువల్ల ఈ పంటను విస్తరిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఉపాధిహామీ రాష్ట్ర విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని వనభసింగిలో ఉపాధి హామీ పథకంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, సిల్వర్ ఓక్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. గిరిజన రైతుల నుంచి సాగు వివరాలను తెలుసుకున్నారు. సాగు విస్తీర్ణం మరింత పెంచాలని, ఇందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. మండలానికి మంజూరైన 2.80 లక్షల డ్రాగన్ ఫ్రూట్ మొక్కలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత వాతావరణం డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అనుకూలమని చెప్పారు. ఆ సాగు చేపట్టడం ద్వారా గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునన్నారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఏపీవో సంగంనాయుడు, ఉపాధి హామీ, హార్టికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు


సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న పీడీ శివయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు

వై.రామవరం: స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్ద మండలంలో 2023– 24 సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై గురువారం ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా పీడీ ఎం.శివయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రజావేదికలో వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, మండలంలోని సర్పంచ్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ శివయ్య మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన 1,827 ఉపాధి పనులకు సంబంధించి రూ.30,39,67,734ల ఖర్చుకు ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలపై ఈ ప్రజావేదిక నిర్వహించినట్టు తెలిపారు.

ఈ తనిఖీల్లో చిన్న చిన్న పొరపాట్లు మినహా అక్రమాలు చోటుచేసుకోలేదన్నారు. పనుల్లోని కొలతలలో చిన్న చిన్న తేడాలు రావడంతో మండలంలోని టెక్నికల్ అసిస్టెంటులకు రూ.9,750లు రికవరీ పెట్టినట్లు తెలిపారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఫీల్డు అసిస్టెంటులకు రూ.6వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టనున్నామని, ఇందుకు పనులు గుర్తించనున్నట్టు చెప్పారు. జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, పంచాయతీ విస్తరణాధికారి డి.శివకుమార్, ఏపీవోలు సాయిబాబా, స్వామి, టెక్నికల్, ఎఫ్ఏలు, మేట్‌లు విలేజ్ సోషల్ ఆడిటర్స్, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి


జిల్లా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : వైద్య సేవల కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. వీటిపై తరచూ ఫిర్యాదులు అందుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర దృష్టికి తీసుకువెళ్లారు. వైద్య సేవలు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నిత్యం సిబ్బంది, డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

పీఎం జన్‌మన్‌పై విస్తృత ప్రచారం

రంపచోడవరం: పీఎం జన్‌మన్ కార్యచరణ కోసం ఈ నెల 23 నుంచి 10వ తేదీ వరకు కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఈ క్యాంపెయిన్‌లో 11 అంశాలపై కార్యచరణ రూపొందిచనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి, రహదారుల నిర్మాణం, విద్యుత్, నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం , ఆరోగ్యం, పౌష్టికాహారం,జీవనోపాదులు మెరుగు, ప్రచార సాధనాల సౌకర్యం మెరుగు పరచడం వంటి అంశాలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ఆధార్‌కార్డు,ఆయుష్మాన్ భారత్ కార్డులు వంటివి లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

పాడేరు : జెన్‌పాక్ట్ ఐటీ కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి. ప్రశాంత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2022 నుంచి 2024లో బీటెక్ లేదా ఏదైన డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 28లోగా http:/bit.ly/46wzqz6 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తివివరాలకు 9988853335 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పట్టాలు


చింతపల్లిలో గిరిజనులను విచారిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారి గౌతమి కుమారి

చింతపల్లి: వివాదాల్లో ఉన్న భూమసమస్యలను పరిష్కరించి అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద అవసరమైన పట్టాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఫారెస్టు షటిల్‌మెంట్ అధికారి (విశాఖ) గౌతమి కుమారి తెలిపారు. అటవీ భూములకు సంబంధించి వివాదాలపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమె కోర్టు నిర్వహించారు.

కుడుముసారి గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములపై వివాదాలు కోర్టులో ఉన్నందున వాటికి సంబంధించిన విచారణ చేపట్టారు. గిరిజనుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు


విద్యార్థుల నోటుపుస్తకాలను పరిశీలిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

రంపచోడవరం : ఉపాధ్యాయులు ప్రతీ రోజు సమయానికి పాఠశాలకు హాజరు కావాలని ఏజెన్సీ డీఈఓ వై.మల్లేశ్వరరావు అన్నారు. మండలంలో బూసిగూడెంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఫేషియల్ హాజరు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు డైరీలు, లెసన్ ప్లాన్లు తప్పనిసరిగా రాయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. 20శాతం మంది విద్యార్థినులు చదువులో వెనుకబడి ఉన్నట్టు తెలిపారు. వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్ఎంకు సూచించారు. భోజనశాల, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు వండిన భోజనాన్ని రుచి చూశారు. మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు.

ఒకటి నుంచి పక్కాగా పశుగణన

- కలెక్టర్ దినేష్‌కుమార్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : జిల్లా వ్యాప్తంగా వచ్చేనెల ఒకటి నుంచి పక్కాగా పశుగణన చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో గాలికుంటు వ్యాధి టీకాల వినియోగంపై పశుసంవర్ధక శాఖ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లాలో 5,95,500 ఆవులు, గేదెలు ఉన్నాయని వీటికి గాలికుంటు వ్యాధి నివారణ రెండో దశ టీకాలు వేయాలని సూచించారు. బ్రూసెల్లా వ్యాధి సోకకుండా నాలుగు నెలల నుంచి ఆరు నెలల వయసు గల ఆడపెయ్యిలకు టీకాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ సీహెచ్ నర్సింహులు, పశువైద్యాధికారులు రాజీవ్‌కిరణ్, సుజన పాల్గొన్నారు.

కలుపు నియంత్రణతోనే అధిక దిగుబడులు

ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి


అవగాహన కల్పిస్తున్న ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి

చింతపల్లి: కలుపు మొక్కలను సమర్థవంతంగా నివారించ గలిగితే అధిక దిగుబడులు పొందవచ్చని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి అన్నారు. వయ్యారిభామ కలుపు మొక్కల నివారణ వారోత్సవాల్లో భాగంగా గురువారం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్‌వి ద్యార్థులు, గిరిజన రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో వయ్యారి భామ కలుపుమొక్కల అన్ని పంటలనూ తీవ్రంగా నష్టపరుస్తుందన్నారు. పంటలతో పాటు మనుషుల ఆరోగ్యాలనూ దెబ్బతీస్తుందన్నారు. కలుపు మొక్కల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి, బయ్యపురెడ్డి, డాక్టర్ ఉజ్వలరాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలకు అధికారులు విధిగా హాజరు కావాలి


కట్టా సింహాచలం, పీవో

రంపచోడవరం: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలు అభివృద్ధి కోసం ఈ నెల 23 నుంచి గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ప్రజాప్రతినిధులతో, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో గ్రామసభలు ఏర్పాటుచేస్తామన్నారు.అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని తెలిపారు. గ్రామసభల తీర్మానాలతో ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఎట్టి పరిస్థితుల్లో సెలవు ఇవ్వడం జరగదని తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పీవో తెలిపారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌జామ్


ఘాట్ రోడ్డులో మరమ్మతుల కారణంగా నిలిచిపోయిన లారీ

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూర్ ఘాట్ రోడ్డులో భారీ వాహనం రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మారేడుమిల్లి మీదుగా బడిశాకు లోడ్‌తో లారీ వెళ్తుండగా ఘాట్‌రోడ్డులోని వాలీసుగ్రీవ్ మలుపు వద్ద మరమ్మతుల కారణంగా రహదారికి అడ్డంగా నిలిచిపోయింది. సుమారు మూడు గంటల సేపు ఇరువైపులా భారీ వాహనాలు నిలిచిపోయాయి.

కారు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

మారేడుమిల్లి : కారు ఓ బాలుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని వేటుకూరు గ్రామానికి చెందిన పేంట సురేంద్ర, అతని కుమారుడు పెంట లేహర్షన్ స్థానిక బోదులూరు సెంటర్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి కారు బాలుడి కాలును ఢీకొని కాలుపై నుంచి రాసుకుంటూ వెళ్లిపోయింది. దీంతో బాలుడికి కాలు మడం చిట్లిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మెడికవర్ ఆస్పత్రిలో
- కె.రాంబాబు, రాంబిల్లి
- బి.శివ వెంకటరత్నం, రాంబిల్లి
- వై.మహేష్‌బాబు, మున్నిపడ
- పి.జగదీశ్వరరావు, నక్కపల్లి
- కె.చంద్రశేఖర్, బొబ్బిలి
- పి.దేముడు, బోయపాలెం
- కె.నారాయణరావు , శ్రీకాకుళం

కిమ్స్ ఐకాన్
- డి.శ్రీనివాస్ వర్మ
- జి.ఎస్.వరప్రసాద్‌రాజు
- పి.అరుణ్‌కుమార్

పవన్ సాయి ఆస్పత్రి, కూర్మన్నపాలెం
- జి.సంతోష్, విజయనగరం
- జి.సాయికుమార్, ఎస్.కోట
- జె.ప్రకాశ్, వెపడ

ఆర్కే ఆస్పత్రి, గాజువాక
- జి.చైతన్య

ఉషా ప్రైమ్ ఆస్పత్రి, అనకాపల్లి
- జె.వర్ధన్, జంగాలపాలెం, ఎస్ఈజెడ్ కాలనీ
- జి.రాజారావు, వెంకటాపురం, రాంబిల్లి మండలం
- బి.సూరిబాబు, వై.లోవ, రాంబిల్లి మండలం
- ఎం.కిరణ్ సత్యనారాయణ, శ్రీనగర్, గాజువాక
- డి.అప్పారావు, యలమంచిలి
- ప్రభాత్‌యాదవ్, హన్మకొండ, వరంగల్,
- బంగారు చందకనాయుడు విజయనగరం
- ఎస్.యామిని, ఉమ్మలాడ, మునగపాక మండలం
- ఎస్.వంశీ, హరిపాలెం, మునగపాక మండలం.
- కె.షణ్ముఖరావు రణస్థలం, శ్రీకాకుళం
- బి.ధనుంజయ్, ఒడిశా
- సిహెచ్.అప్పారావు పంచదార్ల, యలమంచిలి మండలం
- ఆర్.సత్యనారాయణ, ధారపాలెం
- కె.షణ్ముఖరాజు దేశపాత్రునిపాలెం, పరవాడ మండలం
- ఎ.పరమేశ్వరరావు, యలమంచిలి
- బి.రామ్ మహిరాబాబు, సోమలింగపాలెం, యలమంచిలి మండలం
- ఎస్.అప్పారావు, లెవి కాలనీ
- నోట్ల పైడి కల్యాణ్, వాశెట్టిపాలెం, ఎస్ఈజెడ్ కాలనీ

జనజీవన గీతం జానపదం


మాట్లాడుతున్న బ్రహ్మానందం

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో అన్ని రంగాల మాదిరిగానే.. కళా రంగాన్ని కూడా పరిరక్షిస్తామని, కళాకారులను ఆదుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురజాడ కళాక్షేత్రంలో గురువారం ఉత్తరాంధ్ర జానపద జాతర జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతీ కళాకారుడుకి పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జనం నుంచి పుట్టిందే జానపదం అని, జానపద కళలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. పద్య నాటకాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని.. తెలుగు మాండలికాలను కాపాడతామన్నారు. ఉత్తరాంధ్ర కళాకారుడు వంగపండు పాట అద్భుతమని కొనియాడారు. అలాంటి ఎంతో మంది కళాకారులకు ఉత్తరాంధ్ర నిలయమన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత మాట్లాడుతూ జానపద కళారూపాలను కాపాడుకోవాలని, ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి.. కళలను బతికిస్తున్నారని నిర్వాహకులను అభినందిచారు.

కళలకు పెట్టింది పేరు ఉత్తరాంధ్ర

కళలకు, కళాకారులకు ఉత్తరాంధ్ర పెట్టింది పేరని ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం అన్నారు. సృష్టిలో నుంచి పుట్టిందే పాట అని, అక్షరాలను మాటలు, పాటలుగా పేర్చేదే జానపదం అన్నారు. వంగపండు పాట కడుపు కాలితే వచ్చిన పాట అని అన్నారు. కళాకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జానపద నృత్యాలు, పాటల ప్రదర్శన అద్భుతంగా సాగింది. పులి వేషాలు, తప్పెటగుళ్లు, డప్పు ప్రదర్శన, జానపద నృత్యాలు అలరించాయి. లోక్‌నాయక్ ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, దాడి వీరభద్రరావు, రమణమూర్తి పాల్గొన్నారు.